# అడల్ట్స్ ఓన్లీ కథ




# మనసా... పలుకవే...

''వల్లీ! ఇవిగో మల్లె పూలు'' అంటూ తన చేతిలోని మల్లెల మాలని చెల్లెలు-శ్రీవల్లి చేతికిస్తున్న మౌళిని చూడగానే రేవతి మనసు కుత కుత ఉడికిపోయింది.

'తమ పెళ్ళయి మూడ్నెల్లయినా కాలేదు. కొత్త కాపురమన్న మోజు తీరనైనా లేదు. అదేంటో తన ఊసే పట్టనట్టు అన్నీ వాళ్ళ చెల్లెలికి తెచ్చివ్వడమే.

మొన్నటికి మొన్న పండగనాడు రెండు చీరల్ని తెచ్చి, వాళ్ళ చెల్లికిచ్చి, 'నీకు నచ్చింది తీసుకుని మిగిలింది మీ వదినకివ్వు' అన్నారు. తనేం చేసిందని.. అన్నింటికీ తనని ఆమడదూరంలో ఉంచుతున్నారు. అంతా తన తలరాత. కోరి కోరి పల్లెటూరి సంబంధమని సంబరపడి చేసుకున్నందుకు తగిన శాస్తి జరిగింది' కుమిలిపోతున్న ఆమె మనసు గతంలోని ఆనంద క్షణాల్ని తరచి చూసుకోసాగింది.

★ ★ ★



రేవతికి డిగ్రీ అయ్యిందో లేదో..మంచి సంబంధం అంటూ మౌళితో పెళ్ళికి ఒత్తిడి తెచ్చారు రేవతి తల్లిదండ్రులు. ఆ అబ్బాయి తన కంటే తక్కువ చదువుకున్నా, పల్లెటూరు సంబంధం కనుక వెంటనే 'సరే'నంది రేవతి. కాలేజీ రోజుల్లోని మిత్రురాళ్ళు పల్లెటూర్ల గురించి వర్ణించి చెప్పడం వల్ల ఆ అందాల నెలవుల్లో కాపురముండబోతున్నానని సంతోషపడింది.

పెళ్ళి ఘనంగానే చేశారు రేవతి తల్లిదండ్రులు.

సారెతో అత్తింట్లో అడుగుపెట్టిన దగ్గర్నుంచీ ''వదినా..వదినా'' అంటూ వెంట వెంటే తిరుగుతూ ఆమెతో కలిసిపోయింది మౌళి చెల్లెలు శ్రీవల్లి. ఇక అత్తగారు సరేసరి. ''ఆయన పోయిన దగ్గర్నుండీ బాధ్యత అంతా తలకెత్తుకుని అలిసిపోయాను. ఇక నుండైనా కృష్ణా రామా అనుకుంటాను'' అంటూ తాళం చెవుల్ని రేవతికి అప్పజెప్పిందావిడ.

ఆ ఇల్లు పల్లెటూర్లో ఉందన్న మాటే గానీ, లేని సదుపాయమంటూ లేదు. మౌళి కాక ఆ ఇంట్లో ఉండే ఇద్దరూ ఆడవాళ్ళే కావడంతో ఇంటిని అనుకూలంగా రీమోడల్ చేయించాడు మౌళి.

ఇంటికి మూడువైపులా ఖాళీ స్థలమే. ఒక వైపు చిన్న చిన్న కూరగాయల పాదులు, పూలమొక్కలు, మరోవైపు ఉన్న రేకుల షెడ్లో మంచి నీళ్ళ పంపు, సిమెంటుతో చేయించిన నేల, పెద్ద నీళ్ళ కుండీ.. అంట్లూ బట్టలూ లాంటి ఇంటి పనుల కోసమని కట్టించాడది. దాని వెనకగా బాత్‌రూం సౌకర్యాలున్నాయి. స్నానం చేశాక అక్కడే బట్టలు కట్టుకోవడం కోసం బాత్‌రూంని పెద్దగా కట్టించి, అందులో సగభాగాన్ని కొంచెం ఎత్తు చేయించాడు.

ఆ ఇంటిని చూసి 'పల్లెటూర్లో ఇంత మంచి ఇల్లా' అని ఆశ్చర్యపోకుండా ఉండలేకపోయింది రేవతి.

మౌళి, రేవతిల జంట చూడ ముచ్చటగా ఉంటుంది.

'ఎక్కువ చదువుకున్నా'నన్న అహం చూపని రేవతంటే మౌళికి అభిమానం. కోడలిగా ఇంటి విషయాల్ని పట్టించుకుని, ఇల్లుని అందంగా తీర్చిదిద్దే భార్యని చూసి గర్వపడేవాడు. క్షణ క్షణం 'రేవతీ..రేవతీ' అంటూ కలవరించేవాడు.

అలాంటిది కొద్ది రోజులుగా రేవతితో ముభా

బి.నాగబాబు

## ఆంధ్రభూమి దిన పత్రిక ఉగాది పోటీలో ఎంపికైన కథ

వంగా ఉంటున్నాడు. రాత్రి పడక మీద తప్ప అంతగా మాట్లాడ్డం కూడా తగ్గించేశాడు.

'ఎందుకలా ఉంటున్నా'రని అడుగుదామను కుంటూనే 'పొలం కోత కొచ్చింది కదా. కూలోళ్ళ గొడవలేమో' అని తనకు తానే సర్ది చెప్పుకుంటోంది ఎప్పటికప్పుడు.

అసలే మనసులో ఏవేవో ఆలోచనల్తో ఉన్న రేవతి ఆ రోజు సాయంత్రం జరిగిన సంఘటనని జీర్ణించుకోలేకపోయింది.

మౌళి వస్తూనే ''వల్లీ! నీకేం తెచ్చానో చూడు'' అంటూ గట్టిగా పిలిచాడు. వంట గదిలో ఉన్న రేవతి అది విని, 'మల్లెపూలు తెచ్చుంటార్లే' అనుకుని, కూర కోసం పోపు వేయసాగింది.

రెండు నిముషాల తర్వాత ''వదినా.. ఇవి చూడు'' అంటూ ఆనందంతో వంట గదిలోకి వచ్చింది శ్రీవల్లి.

గాజులు, దుద్దులు, నెక్లెస్, ఉంగరాల్తో ఉన్న రాళ్ళసెట్‌ని చూసి, షాకయింది రేవతి.

''అన్నయ్య నా కోసం తెచ్చాడు. చాలా బాగున్నాయి కదూ. అమ్మకు చూపించి వస్తానాగు'' అంటూ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది శ్రీవల్లి.

రేవతి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

'తన చెల్లెలికి కొంటానంటే నేను వద్దంటానా, అంత విలువైనవి కొనేటప్పుడు కనీసం ఒక్క మాటైనా భార్యనైన నాతో చెప్పకూడదా' అనుకుని చింతించింది.

అయినా తన భావాల్ని బయట పడనీయక వంట ముగించి, హాల్లోకి వచ్చింది.


అప్పటివరకూ తల్లీ, చెల్లెలితో మాట్లాడుతున్న మౌళి- 'వేను కెళ్ళాలం'టూ లేచి వెళ్ళిపోయాడు.

చివుక్కుమనిపించింది రేవతి మనసుకి.

''మన గౌరీశంకరం ఉంగరం చేయించుకోవడానికి పట్నం వెళ్తూ మౌళిని తోడు రమ్మన్నాడట. అక్కడ వల్లికి ఇవి బాగుంటాయన్పించి కొన్నాడట'' అంటూ చెప్తున్న అత్తగారి మాటలు వింటూ ముఖంపైన ఓ నవ్వు అతికించుకుంది రేవతి.

మరో రెండు రోజులు భారంగా గడిచాయి.

ఆ రోజు ఉదయం పది గంటలవుతుంటే, ''ఈ రోజు వల్లీకి పెళ్ళి చూపులు. వల్లీకీ, అమ్మకీ చెప్పి సిద్ధం చెయ్యి. వాళ్ళు పన్నెండు గంటలకొస్తామన్నారు'' అని చెప్పి, పొలానికి వెళ్తున్న భర్తని కొయ్యబొమ్మలా చూస్తుండిపోయింది రేవతి.



★ ★ ★

వచ్చిన వాళ్ళకి వల్లి నచ్చడంతో మరో పది రోజుల్లో ఉన్న ముహూర్తానికే లగ్నపత్రిక వ్రాయించేసుకున్నారు వాళ్ళు.

పెళ్ళికి కావలసిన బట్టలు కొనడం, కుట్టించడం, సామాన్లు తీసుకోవడంలో రోజులు చకచకా దొర్లిపోతున్నాయి.

'పెళ్ళి కళ్యాణ మండపంలో చేద్దాం' అన్న మౌళి మాటలకి ఎవరూ అడ్డు చెప్పలేదు.

పెళ్ళి పనుల్లో హడావుడిగా అన్నీ తానై తిరుగుతున్న భర్తని చూసి, రేవతి మనసు కరిగిపోయింది. కొంచెం తీరిక చిక్కినా అతన్ని విశ్రాంతి తీసుకోమని, తనకు చేతనైన పని తానందుకునేది. బాధ్యతగా తండ్రి లోటు తెలీనీకుండా శ్రీవల్లికి ఏం కావాలో అడిగి మరీ కొంటున్నాడు అన్నీ. అది చూసి, ఒకప్పుడు ఉక్రోషపడిన రేవతి మనసు రెట్టింపు ప్రేమతో పొంగిపోయింది.

ఎదురు చూసిన రోజు రానే వచ్చింది.

ముహూర్తం సాయంత్రం ఏడు గంటలకే అని, మధ్యాహ్నం నుంచే అందరూ మండపం చేరుకున్నారు. ఒకటీ రెండు మర్చిపోయినవి ఉంటే మౌళి బండిమీద ఇంటికి వెళ్ళి తెచ్చాడు.

'గౌరీ పూజకు కూర్చున్న వల్లి అచ్చంగా గౌరీదేవిలానే

### రారా మన్మథా..

**పెళ్లికాని అమ్మాయిలు తమకు కాబోయే భర్త అలా ఉండాలి, ఇలా ఉండాలి అంటారు. ఇక సినీతారల సంగతికొస్తే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అందాల భామ రియాసేన్ మాత్రం తన మనస్తత్వానికి తగ్గట్టుగా ఉండే మగాడ్నే ఎంచుకుంటానంటోంది. 'పెళ్లి ద్వారా పరిణతి వస్తుంది. జీవితాంతం ఇద్దరికైనా తోడు కావాలి. అయితే ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉండాల్సిన అవసరం ఏమీ లేదు. అయితే ఒకరినొకరు అర్థం చేసుకుంటే సరిపోతుంది' అంటోంది. తనకి నచ్చే ప్రియసఖుడి కోసం ఆమె అన్వేషణ సాగిస్తున్నట్టుంది.**

ఉంది. తన దిష్టే తగులుతుందేమో..' అనుకుంది రేవతి.

చుట్టాల్ని పలకరిస్తున్న రేవతిని సమీపించి, ''నువ్వు వెళ్ళి దగ్గరుండి వల్లీకేమైనా అవసరమైతే చూడు'' అంటూ చెయ్యి పట్టి లాక్కెళ్ళాడు మౌళి.

మౌళి ప్రక్కన కూర్చుని కన్యాదానం చేస్తున్నప్పుడు తనలో తనకే ఏదో పెద్దరిక హోదా..!

పెళ్ళి అవగానే ముందు అన్నావదినల కాళ్ళకు నమస్కరించి ''అన్నయ్యా'' అంటూ మౌళిని పట్టుకుని ఏడ్చేసింది శ్రీవల్లి.

అప్పగింతలప్పుడు కారు దగ్గర వెక్కిళ్ళు పెడుతున్న శ్రీవల్లిని చూసి రేవతికీ కళ్ళనీళ్ళు పొంగాయి. భర్త కోసం అటూ ఇటూ చూసిందామె. అందరిలోంచీ తప్పుకుని దూరంగా వెళ్తున్నాడతను.

నిదానంగా అతన్ని సమీపించి భుజం మీద చెయ్యి వేసింది. చప్పున వెనక్కు తిరిగిన అతని కళ్ళలో నిండుగా తొణికిసలాడుతున్న నీరు..!

''రేవతీ...!'' అంటూ రేవతి భుజం మీద తలవాల్చి ఏడ్చేశాడు మౌళి.

చిన్నపిల్లాడిలా ఏడుస్తున్న భర్తలోని సున్నిత మనస్తత్వాన్ని చూసి జన్మ జన్మలకీ తను మౌళికి భార్యగా ఉండే వరాన్నిమ్మని మనసులోనే దేవుడ్ని వేడుకుంది రేవతి.

అతని భుజాన్ని తట్టి, కళ్ళు తుడుస్తూ ''రండి. వల్లీ మీకోసం చూస్తోంది'' అంది రేవతి.

గుండెను గట్టి చేసుకుని రేవతితో ముందుకు నడిచాడు మౌళి. కారు దగ్గర నుంచుని మౌళికోసం చూస్తోంది వల్లి.

మూడు నిద్రల కోసం వల్లీతోపాటు తల్లినీ, తెల్సిన మరో ఇద్దర్నీ పంపి, తాను 'మూడో రోజున వస్తా'నని చెప్పాడు.

పెళ్ళి కారుకు వీడ్కోలు పలికాక కళ్యాణమండపం ఖాళీ చేసి, ఇంటికి బయల్దేరేసరికి తొమ్మిది దాటింది సమయం.

★ ★ ★

ఎర్రబడ్డ కళ్ళతో నీరసంగా ఇల్లు చేరారు మౌళి, రేవతి.

స్నానం చేస్తావా అన్న భర్త మాటలకి ''ఊ'' అని తలూపింది రేవతి.

అప్పటికప్పుడు నాలుగు కొబ్బరాకులు వెలిగించి కట్టెలపొయ్యి మీద నీళ్ళు పెట్టాడు. అందరి స్నానాలకి వేణ్ణీళ్ళు మౌళీనే పెడతాడు. ఆడాళ్ళు ముగ్గురూ 'మేం ఉన్నాం కదా' అంటే 'గ్యాస్ స్టవ్ మీది- కట్టెల పొయ్యి నాది' అంటాడు.

'తలమీద అక్షింతలు, పూలు..అన్నీ పడటంతో తలంతా చిరాగ్గా ఉంది. తలకు చెయ్యాలి-' అనుకుంటూ షాంపూ, టవలు, నైటీ తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళింది.

రేవతి స్నానం చేస్తుంటే తలుపు చప్పుడైంది. 'ఏంటా..' అని చూస్తే తలుపు మీద బట్టలు వేశాడు మౌళి ''ఇవి కట్టుకో'' అంటూ.

ఓ పక్క చలి పెడుతుంటే, వేణ్ణీటి స్నానం హాయిగా అన్పించి, తాపీగా స్నానం కానిచ్చింది రేవతి.

మౌళి తలుపు మీదేసిన చీర చూసి 'కొత్తది, ఇప్పుడెందుకు?' అనుకుంటూ కట్టుకుంది.

కాఫీ రంగు సిల్కు చీర మీద వెండి జరీతో చిన్న చిన్న లతలూ పూలూ కుట్టి ఉన్న చీరది. కట్టుకోవడం పూర్తయ్యాక అద్దంలో చూసుకుంది రేవతి.

ఆమె ఒంపు సొంపుల్నీ, మేని రంగునీ ప్రస్ఫుటంగా తెలియజేసేంత పల్చగా ఉందా చీర. అద్దినట్టు ఒంటికి అతుక్కుని పొందిగ్గా అంటిపెట్టుకున్నట్టుందది.

అద్దంలో తన రూపం తనకే మరింత అందంగా కన్పించిందామెకి. పైనుంచి కిందకు ఓసారి చూసుకుని కుచ్చెళ్ళు సరిచేసుకుని బయటకు వచ్చింది రేవతి.

వచ్చీ రావడంతోనే నిన్ను చూడాలన్నట్టు బయట వరండాలోనే నుంచుని ఉన్నాడు మౌళి. స్నానం చేసి లుంగీ, బనీనుతో ఉన్నాడతను.

తడి టవలుని వరండాలోని తీగ మీద ఆరేసి, అలానే చూస్తున్న భర్తని ''ఏంటలా చూస్తున్నారు?'' అని అడిగింది. అంతలోనే సిగ్గుగా తల దించుకుని లోపలికి నడిచింది.

అతనూ అనుసరించి తలుపులేస్తూ, ''ఎలా చూస్తున్నాను?'' అన్నాడు.

''తినేసేలా..'' అని చిన్నగా అంటూ కంచాలు పెట్టసాగింది.

ఆమె చేతిని పట్టుకుని తన వైపు లాక్కుని, ''తినేసేలా చూస్తున్నానన్నావుగా..ముందు నిన్ను తిననీ'' అన్నాడతను.

''అబ్బ వదలండీ..మీరు మధ్యాహ్నం కూడా ఏమీ తినలేదు'' అంటూ అతని చేతుల్ని విడిపించుకుని, టేబుల్‌వైపుతిరిగిందామె.

''అందుకేనేమో మరీ ఆకలిగా ఉంది'' అంటూ ఆమెని వెనక నుంచి హత్తుకుంటూ, ఒళ్ళంతా తడుముతూ, తమకంగా నొక్కుతూ ఆమె చేతుల్ని పట్టుకున్నాడతను.

ఒక్కసారిగా మైకం క్రమ్మినట్టు అతని మీదకు కొద్దిగా వాలిందామె.

వీపుకి గడ్డాన్ని రాస్తూ, ''రేవతీ! నువ్వు నాకు భార్యగా దొరకడం నా అదృష్టం. ఒక్కోసారి నిన్ను గుండెల్లో శాశ్వతంగా ఉంచేసుకోవాలనిపిస్తుంది'' అంటూ ఆమె బుగ్గలు సవరించాడు మౌళి.

''ఒక్కోసారి నాతో మాట్లాడబుద్ధి కాదు కదా?'' అని అడిగింది నిర్లిప్తంగా రేవతి.

ఆమెలో వచ్చిన మార్పు అర్థం కాక ఆమెను తనకభిముఖంగా తిప్పుకుని, ''ఏమైంది? నేనేం చేశాను?'' అనడిగాడు నొసలు ముడుస్తూ.

'ఆయన మూడ్ చెడగొట్టానా..' అని మధనపడుతూ, ''ఏం లేదులెండి'' అందామె.

అతను వదల్లేదు. ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని ''రేవతీ! మన మధ్య దాపరికాలెందుకు? ఒకటీ రెండు రోజుల్లో విడిపోయేవారం కాము మనం. జీవితాంతం వీటి బరువును మోస్తావా? చెప్పు...ఎందుకలా అన్నావు?'' అన్నాడు బుజ్జగిస్తూ.

''మొన్నామధ్య కొన్ని రోజులు నాతో సరిగ్గా మాట్లాడలేదు. చివరికి పువ్వులు కూడా వల్లీకిచ్చేవారు. నాకు తేవాలన్న ఆలోచనే మీ మనసులో లేనట్లు'' అంది సంశయంగా.

''అదా'' అని గట్టిగా నవ్వేశాడు మౌళి. ''ఇంత చదువుకున్నావు. ఆ మాత్రం అర్థం చేసుకోలేవా?'' అన్నాడు ఇంకా నవ్వుతూనే.

''చెప్తే ఇంకా అర్థం చేసుకుంటానుగా..'' అంది రేవతి ఉడుకుగా.

''వల్లీ వయసొచ్చిన పిల్ల. మన మాటలు, చేతలు తనమీద ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో తెలీదా? నువ్వా పరిస్థితిలో ఉండి ఆలోచించు. నీ అన్నా వదినలు నీ ముందే సన్నిహితంగా మెలిగితే నీకు ఎబ్బెట్టుగా ఉండదూ. అదీకాక మన పెళ్ళైన కొన్ని రోజుల్నుంచీ వల్లీ నాతో ఇదివరకట్లా ఫ్రీగా ఉండట్లేదు. ముభావంగా ఉంటోంది. తన పెళ్ళయ్యే వరకేకదా అది ఇక్కడుండేది. మనకి ముందు ముందు చాలా జీవితం ఉంది. కానీ దానితో గడిపేది ఈ కొన్ని రోజులే కదా. అసలు వల్లీకి పెళ్ళి చేశాకే నేను చేసుకుంటానన్నాను. కానీ, అమ్మ 'మంచి సంబంధం..అమ్మాయి బంగారపు బొమ్మలా ఉంది. ఇలాంటి సంబంధం మళ్ళీ దొరకదు' అని పట్టుబడితే సరే అన్నాను'' అని ఆపి, ''ఆరోజు 'సరే' అనకపోతే ఎంతందాన్ని మిస్సయ్యేవాడినో..'' అంటూ ఆమె లేత నడుముని చేతుల్లో బంధించాడు.

''ఎంతందాన్ని..?'' కొంటెగా అడిగిందామె సిగ్గుగా తలదించుకుంటూ.

''నీకూ చూపించనా'' అంటూ ఉన్న పళాన ఆమెను చేతులమీద గాల్లోకి లేవనెత్తి బెడ్‌రూమ్‌లోకి నడిచాడు మౌళి.

మనసు పొరల్లోని ఎడబాటు ఎంతో బాధ కలిగించినా తరువాత కలయికలో కలిగే ఆనందం మనసుకు అంతు బట్టదు.

మనసుకు మౌనం కొన్నిసార్లే బాగుంటుంది. పలుకలేని మనసు భావాలు పంచలేని మూగ మనసే. మాటలు మూగవైనా పర్లేదు. కానీ మనసు మూగదైతే జీవితాంతం శూన్యమే.

☆